## అడల్ట్స్ ఓన్లీ కథ A

# ఏకాంతవేళ

## నల్లాన్ చక్రవర్తుల గోపీమాధవులు

‘‘నానోయ్! స్నానం చేసేటపుడు మనిషన్నవాడు బక్కెట్లో నుండి మగ్గుతోనే ఎందుకు తీసి నీళ్లోసుకుంటాడు?’’ నడుముకి చేతులాన్చి సీరియస్‌గా అడిగింది కృతి.

శశాంక ఒక్కసారి తలెత్తి చూశాడు. ఆరేళ్ల కృతి యక్షప్రశ్నలకు ఒక్కోసారి ఏ సమాధానం చెప్పాలో అర్థం కాదతడికి. అటువంటి సందర్భాల్లో బుర్ర గోక్కుంటాడు. అప్పుడూ అదే చేశాడు. నాన్నే వెర్రివెంగళాయిలా కనిపించాడు దానికి. పకపకా నవ్వేసింది.

‘‘ఎందుకంటే, బక్కెట్ పెద్దది, మగ్గు చిన్నది. అందుకన్నమాట!’’ అంది అరమోడ్పు కన్నులతో మొహమంతా చిత్రవిచిత్రంగా తిప్పుతూ.

శ్రీకృష్ణుడి ముందు అర్జునుడిలా మోకాళ్ల మీద కూర్చుని, ‘‘ఒరే అంకులూ... నీకిలాంటి గొప్ప గొప్ప వడియాలెలా వస్తాయిరా?’’ అన్నాడు శశాంక రెండు చేతులూ జోడించి.

‘‘అదంతే లేరా పెంకులూ...’’ అంటూ గబగబా మగ్గు తీసి నీళ్లు మీద వొంపుకోవడం మొదలెట్టింది కృతి.

శశాంక కూతుర్ని అంకులూ, బ్రదరూ, యెదవాలాంటి ముద్దుపేర్లతో పిలుస్తాడు. అదేం తక్కువ తిందా... వాటికి వికృతులను ఆశువుగా అల్లేసి తిప్పికొడుతుంది.

కృతి స్నానం చేస్తుంటే గబగబా అయ్యేట్టు చూడవలసిన డ్యూటీ పడింది శశాంకకు. దరిదాపుల్లో ఎవరూ లేని దాఖలాలుంటే చాలు, బక్కెట్లకొద్దీ నీళ్లు గుమ్మరించుకుంటుంది కృతి. అందుకే ఈ నిఘా.

అంతలో ‘‘బంగాళాదుంప వేపుడు, గుత్తివంకాయ కూర అయ్యాయి. మీకు బాక్సు సర్దమంటారా?’’ అంటూ శ్రుతి వచ్చి వంటింటి గుమ్మంలో నిలబడింది.

‘‘అలాగే... సర్దు. నేను స్నానంచేసి...’’ శశాంక మాట సగంలోనే ఆగిపోయింది.

నైటీ పల్చగా వుందేమో... *36-28- 36* ఆకారం స్పష్టంగా కనిపిస్తోంది. సెక్సీగా వున్న నడుం మీద చేతిని ఆన్చి నిలబడి వుంది శ్రుతి.


శ్రుతి అందంగా వుంటుంది. సెక్సీగా వుంటుంది. మనోహరంగా వుంటుంది. అందుకే శశాంక ఆమెను చూసిన ప్రతిసారీ కన్నార్పకుండా పదినిమిషాలైనా చూస్తాడు. ఇంకా ‘వీలుంటే’ వెళ్లి గభాల్న తన కౌగిట్లో బంధించేసి ఊపిరాడకుండా చేస్తాడు.

‘‘ఇదో... నువ్విలా నిలబడి నాతో మాట్లాడకు. వంటింట్లోకి వెళ్లి పని చూసుకో...’’

‘‘ఎలా నిలబడ్డాను?’’ అసలే అమాయకంగా వుండే చిన్ని దొండపండు పెదాలను సున్నాలా చుట్టింది. ఇదంతా జరుగుతుంటే దొంగతనం చేస్తున్నవాళ్లను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న పోజుతో వాళ్లనే చూస్తోంది కృతి.

శశాంక పట్టుబడిపోయిన దొంగలా తడబడ్డాడు. ‘‘నువ్వేంటీ అలా చూస్తున్నావ్? తొందరగా స్నానం చేస్తావా, రెండు తగిలించమంటావా?’’

‘‘నేను స్నానం చేస్తున్నాను. నువ్వేం చేస్తున్నావు?’’ నిలదీసింది కృతి. ఈలోగా వంటింట్లో ఏదో మాడుతున్నట్టు వాసనొస్తే గబగబా వెళ్ళి



పోయింది శ్రుతి.

వెళుతూ వెళుతూ ఎత్తైన జఘనాలు శశాంకను వెర్రెత్తించాయి.

''ఏవోయ్... నీ స్నానం అయిందిగా, నేనలా వెళ్లి టవల్ పుచ్చుకొస్తాను'' అని కూతురికి చెప్పి మెల్లిగా పిల్లిలా వంటింట్లో దూరాడు. శ్రుతిని చూస్తుంటే అతడికి పిచ్చెక్కిపోతోంది. ఆత్రంగా వెళ్లి గభాల్న వెనక నుండి గట్టిగా కౌగిలించుకున్నాడు.

శ్రుతి ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ''ఏవిటి మీరు మరీనూ... ఇక్కడ కూర మాడిపోతోంది'' అంది చిరుకోపాన్ని ప్రదర్శిస్తూ.

''సర్లే... ఇక్కడ మనసే మాడిపోతోందిలే...'' శ్రుతిని అల్లుకుపోతూ అన్నాడు శశాంక.


''మనసు మాడిపోదు, కాలిపోతోంది అనాలి'' సవరించింది.

''ఏదో ఒకటిలే! కనీసం నిన్నిలా కౌగిలించుకుని ఎంతకాలమైందో...'' వీపుమీద ఓ పదిముద్దులిచ్చి మునిపంటితో సుతారంగా చెవి కొరుకుతూ అన్నాడు.

''సరేగానీ, మీ ముద్దుల కూతురు సిఐడిలా వచ్చి

## మార్పు

**సినిమాల్లోకి వచ్చాక ఎలాంటివారిలోనైనా మార్పు కన్పిస్తుంది. అన్నట్టు నేహాదుఫియా గురించే ఇప్పుడంతా గుసగుసలాడుకుంటున్నారు. ఇండస్ట్రీలోకొచ్చిన కొత్తలో అందరిలా ఎక్స్‌పోజింగ్‌కి అవకాశం ఇవ్వను అని చెప్పిన నేహా ఇప్పుడు సినిమాల్లో ముద్దు సీన్స్‌లో బాగా నటిస్తోంది. ఎక్కువసేపుకన్పించే ఇలాంటి సీన్స్ ఆమెకి పేరు తెచ్చిపెడుతున్నాయి. తోటితారలకి గుబులు పుట్టిస్తున్నాయి. జూలీలీ కిస్ సీన్స్‌ని కొంతమంది ఉదాహరణగా చెబుతున్నారు.**



నిలబడుతుందేమో...''

''దాని మొహం! టవల్ తీసుకొస్తానని చెప్పి ఇలా వచ్చేశా!'' తన తెలివికి మురిసిపోయాడు శశాంక.

పిడికెడంత వున్న శ్రుతి నడుమును రెండు చేతులతో పట్టి ఆమెను తన ముందుకి తిప్పుకున్నాడు. గులాబీరేకుల్లాంటి పెదాల మీద ముద్దు ముద్దరేశాడు. ''ఏంటే, పెదాలకి చక్కెరేమన్నా అద్దావా? ఇంత తీపిగా వున్నాయ్?'' అన్నాడు 'చక్కెరకేళి'లను మరోసారి రుచిచూస్తూ.

''చాల్లే బడాయి, వదలండి. ఆఫీసుకి టైమవడం లేదూ?'' శశాంకను గుండెలకు అదుముకుంది శ్రుతి.

''బోడి ఆఫీసు రోజూ తగలడేదేగా? అయినా, 'ఆడువారి మాటలకు అర్థాలే వేరులే' అన్నాడు కవిపుంగవుడు. వదలమంటే, మరో డజను ముద్దులు కావాలని అర్థమన్న మాట.....'' అతడి మాట మధ్యలోనే ఆగిపోయింది. షాక్ కొట్టినవాడిలా శ్రుతికి ఆమడ దూరం జరిగాడు. ఏంచేయాలో అర్థంకాక, కత్తిపీట తీసుకుని గబగబా క్యారెట్లను కోయడం మొదలెట్టాడు. శ్రుతికి ఏమీ అర్థం కాలేదు. గుమ్మంవైపు చూస్తే కృతి ఒంటికి టవల్ చుట్టుకుని సీరియస్‌గా శశాంక, శ్రుతిలనే చూస్తూ నిలబడి వుంది.

''నాన్నా... టవల్ తీసుకొస్తానని చెప్పి వంటింట్లో దూరుతావా? అసలు టవల్ నా దగ్గరే వుంది తెలుసా?''

''ఇక్కడ మీ అమ్మకు సాయం చేయద్దూ... సరే, పద నీకు గౌను వేస్తాను'' అంటూ ఏమీ ఎరగనివాడిలా తయారయ్యాడు శశాంక. ముందు కృతి వెళుతుంటే వెనక నడుస్తూ శ్రుతికి ఏవో సైగలు చేయబోయాడు.

''ఓయ్! ఏంటలా దొంగలా సైగలు చేస్తున్నావ్? పద!'' అని గదమాయించింది వెనక్కి తిరిగి.

''వస్తున్నాను తల్లీ! మీ అమ్మవంక కన్నెత్తైనా చూడను, సరా?''

శశాంక పడుతున్న అవస్థలు చూసి చిన్నగా నవ్వుకుంది శ్రుతి.

★ ★ ★

''కృతీ... ఆడుకుందాం వస్తావా?'' అంటూ గబగబా వగరుస్తూ పరిగెత్తుకొచ్చింది షణ్ముఖ.

షణ్ముఖ పక్క పోర్షన్‌లో వుండే జగన్నాథరావు మనవరాలు. దాని తండ్రి పేరు కార్తీక్. జగన్నాథరావు రిటైర్డ్ మేజర్.

షణ్ముఖ వయసు ఏడేళ్లు. కానీ, ఆ విషయాన్ని అదెప్పుడూ సక్రమంగా ఒప్పుకోదు. ఓసారి తనకు మూడేళ్లే అనీ, మరోసారి ఐదేళ్ల మీద రెండురోజులనీ ఇలా నోటికొచ్చినట్టు చెబుతూంటుంది. దాన్ని పనిగట్టుకుని వయసు అడిగి ఆనందిస్తుంటాడు శశాంక.

అప్పుడు షణ్ముఖ వచ్చేసరికి కృతి తన బొమ్మలన్నింటినీ పేర్చుకుని వంట వండుకునే ఆటాడుకుంటోంది.

''కృతీ... ఏవాట ఆడుకుంటున్నావ్?'' ('మ' అక్షరాన్ని 'వ' అక్షరంలా పలకడం దానికో తుత్తి)

''కనబడ్డంలా? వంటావట!'' అని బహు నిర్లక్ష్యంగా జవాబిచ్చి మళ్లీ సీరియస్‌గా ఆటలోకి దిగబడిపోయింది కృతి. అక్కడే పేపర్ చదువుకుంటూ కూర్చున్న శశాంక ''పాపం, నీ కోసం షణ్ము వచ్చింది కదురా! వాళ్లింట్లోకి వెళ్లి ఓ గంటసేపు ఆడుకోరాదూ...'' అన్నాడు. కృతి వెళితే ఇందాక శ్రుతితో 'మధ్యలో'నే ఆగిపోయిన ఎపిసోడ్‌ని కంటిన్యూ చేద్దామని అతడి ప్లాను.

కృతి ఓసారి తండ్రిని ఖోపంగా చూసింది. నిశ్శబ్దంగా తన బొమ్మలన్నింటినీ బ్యాగులో సర్దింది. ''పదవే షణ్మూ... మనం ఎంచక్కా మీ ఇంట్లోనే ఆడుకుందాం!'' అంటూ షణ్ముఖతో వెళుతూ శశాంకను ఇరాకీ యుద్ధఖైదీ అంత నీచంగా చూసింది.

వాళ్లిద్దరూ అటు వెళ్లగానే ఒక్క ఉదుటున లేచి బెడ్‌రూమ్‌లో వాలాడు. శ్రుతి అప్పుడే స్నానం చేసి వచ్చి చీర సర్దుకుంటోంది.

'నీవు లేక వీణ... ' పాటను కూనిరాగం తీసుకుంటూ చీరచెంగులను చెక్కుకుంటోంది. తెల్లగా, అందంగా కసెక్కిస్తున్న శ్రుతి వీపుభాగం అతడి సహనానికి పరీక్ష పెడుతోంది. సబ్బు సుగంధ పరిమళాలు శ్రుతి ఒంట్లో అణువణువూ ఆక్రమించుకుని గుబాళింపులతో శశాంకను ఆహ్వానిస్తున్నాయి. ఇక ఆగలేకపోయాడు.

అడుగులో అడుగేసుకుంటూ నెమ్మదిగా పిల్లిలా వెళ్లి 'అక్కడ' గాఢంగా చుంబించాడు.

''ష్... ఏంటి దొంగలా వచ్చారు? మీకసలు బుద్ధుందా?''

''భలేదానివే! 'రసానందాన్ని' అందుకోవలసిన ఇటువంటి సందర్భాల్లో బుద్ధెందుకోయ్... అది సరేగానీ, ముందో ఘాటైన ఇంగ్లీషు ముద్దిస్తావా? రుచిచూసి చాలా రోజులైంది! దాని వెనకే ఓ జర్మన్ ముద్దు, తర్వాత ఫ్రెంచి ముద్దు, దాని వెనకే...''

''ఛీ.. మీకసలు సిగ్గులేదు!''

శ్రుతి బుగ్గలు సిగ్గుతో లేత గులాబీ రంగులోకి మారాయి. అలా వుండే శ్రుతి బుగ్గలంటే శశాంకకి చెప్పలేనంత ఇష్టం. చటుక్కున బుగ్గమీద ఓ తీయని ముద్దిచ్చాడు. అడ్డు చెప్పలేదు శ్రుతి. చెలరేగిపోయాడు అతడు. రెండు బుగ్గలకీ సమానంగా ముద్దులు పంచాడు.

ఆ తర్వాత అతడి దృష్టి విల్లులా వంగిన లేలేత పెదవులపై పడింది.

శ్రుతి కళ్ళు ఒకింత భయంతో పెద్దవయ్యాయి. ''ఏవండీ... అది... అది చూస్తోంది''

''దాని మొహం. అదిప్పుడు షణ్ముమవాళ్ళింట్లో ఆడుకుంటోంది. అంతా నీ భ్రమ!'' చిన్నగా నవ్వి శ్రుతి పెదాలను అందుకోబోయాడు శశాంక.

''అబ్బ... చెబితే వినరూ! అటు చూడండి..'' అంది శ్రుతి విసుగ్గా. శశాంక తలుపువైపు చూశాడు.

కృతి ఎంతో ప్రేమగా పెంచుకుంటున్న బంగారురంగు పిల్లిపిల్ల కూర్చుని ఈ జంటనే తదేకదీక్షతో విచిత్రంగా చూస్తోంది.

శశాంకకు నవ్వాగలేదు.

''ఏముందీ, నీ ముద్దుల కూతురే మన మీద నిఘా పెట్టి వెళ్ళినట్టుంది. దాని యజమానురాలు రాకముందే కసెక్కించే పెదాలతో ఓ కిస్సిచ్చెయ్!'' ఆత్రంగా ఆమె మీదకు వంగబోయాడు.

సరిగ్గా అప్పుడే కాలింగ్‌బెల్ మోగింది. శశాంక కంగారుగా మరో గదిలోకి పరుగు తీశాడు. శ్రుతి చీర సర్దుకుని తలుపు తీసేందుకు కదిలింది.

''ఓ... పిన్నీ మీరా? రండి, రండి! ఏంటిలా గుర్తుకొచ్చాం?'' తలుపు తీస్తూనే సంతోషంగా మంగతాయారును ఆహ్వానించింది శ్రుతి.

''నా పేరు మీరా జాస్మినూ, ఆర్తీ అగర్వాలూ కాదే పిచ్చిమొహమా...'' అంటూ చిరునవ్వుతో లోపలికి అడుగుపెట్టింది తాయారు.

ఆమె శశాంక మేనత్త. అల్లుడన్నా, అల్లుడి కుటుంబమన్నా పిచ్చి అభిమానం.

''ఏవండోయ్! ఎవరొచ్చారో చూడండి...'' గబగబా సోఫాలో అడ్డదిడ్డంగా పడివున్న బట్టలను తీస్తూ అంది శ్రుతి.

శశాంక హాలులోకి అడుగుపెడుతూనే ''అత్తయ్యా... ఏంటిలా వచ్చావ్?'' అన్నాడు సంబరంగా.

''నువ్వెలాగూ రావు. నేనొస్తే ఇలా వచ్చావేంటీ అంటావేంట్రా... నాకిలాగే రావడం చేతనవుతుంది. ఇంతకీ నా ముద్దుల సిసింద్రీ ఏదీ?'' మంగతాయారు కళ్ళు ఆత్రంగా వెదికాయి.

''పక్కింట్లోకి ఆడుకునేందుకు వెళ్ళింది పిన్నీ! అయినా, మీ మనవరాలు లేకపోతే మీకొచ్చే లోటేమీ లేదు...'' అని వంటింట్లోకి అడుగేసింది శ్రుతి.

''భలేదానివే... నేనిప్పుడు దాన్ని చూడ్డానికే వచ్చాను. లేకపోతే, మీ మొహాలు చూడ్డానికా?''

''మామయ్య షుగరు ఎలా వుందేమిటే అత్తయ్యా?'' అంటూ ఫ్యాన్ ఆన్ చేసి ఆమె పక్కనే కూర్చున్నాడు శశాంక.

''ఆయనగారి షుగరుకేమిట్రా, భేషుగ్గా వుంది. కాఫీపొడి కలుపుకుంటే ఎంచక్కా కాఫీ తాగొచ్చు. ముక్కు మీదే కోపం. ఆకలికి, నిద్రకీ ఆగలేరు. ఛస్తున్నాననుకో...''

''చరణ్ అమెరికా నుండి ఇప్పట్లో వస్తాడా? చాలా రోజులైంది వాడిని చూసి...'' అని అడిగాడు శశాంక.

చరణ్ మంగతాయారు రెండో కొడుకు. శశాంకకంటే చిన్నవాడు. అమెరికాకు చదుకు నేందుకు వెళ్లాడు.

''ఈ నెలలోనే వస్తున్నానని కబురుపెట్టాడు. నెలాఖరుకేమైనా వస్తాడేమో చూడాలి'' మంచినీళ్లు తాగి గ్లాసు కిందపెట్టింది మంగతాయారు.

సరిగ్గా అప్పుడే కృతి తలుపు తోసుకుని లోపలికొచ్చింది తన బొమ్మలతో సహా.

మంగతాయారును చూసీచూడగానే, ''హాయ్... అమ్మమ్మ.. ఎప్పుడొచ్చావ్?'' అంది సంతోషంగా.

## వార్తల్లో తార

**ఇప్పుడు వార్తల్లో తారగా వెలుగొందుతున్నాడు సల్మాన్‌ఖాన్. వివాదాల నించి తాత్కాలికంగా ఉపశమనం పొందిన సల్మాన్ ఇప్పుడు ఓ పవర్‌ఫుల్ పాత్రతో జనం ముందుకి రాబోతున్నాడు. 'ఆపరేషన్ అర్జున్' అని పేరు పెట్టిన ఈ కొత్తచిత్రంలో ప్రత్యేకంగా కన్పించనున్నాడు. బోనీకపూర్ నిర్మిస్తున్న ఈ చిత్రం కోసం ప్రత్యేకంగా ఆహారనియమాలు పాటిస్తూ క్రమం తప్పకుండా జిమ్‌కి వెళుతున్నాడు సల్మాన్.**



''ఇప్పుడే వచ్చానే తల్లీ! రాగానే నీ గురించి అడిగితే ఈ దొంగలేమన్నారో తెలుసా? నువు బాగా అల్లరి చేస్తున్నావుట.. నేనన్నానూ.. నా చిట్టితల్లి అలాంటిది కాదు, ఎవరైనా అల్లరి చేస్తే బుద్ధి చెబుతుంది అని'' అంటూ కృతిని దగ్గరకు తీసుకుని ఒళ్లో కూర్చోబెట్టుకుంది మంగ తాయారు.

''మరే... అమ్మమ్మా! నాన్న ఎంత అల్లరి చేస్తున్నాడనుకున్నావ్? నిన్న పొద్దున నేను స్నానం చేసి వచ్చే సరికి... ''

అంటూ సాగదీయబోయింది కృతి.

''సర్లే... తప్పంతా నాదేగానీ.. మీరిద్దరూ మీ పర్సనల్ ముచ్చట్లేమైనా వుంటే చూసుకోండి'' మాట మార్చాడు శశాంక.

మంగతాయారు ముసిముసిగా నవ్వింది.

కృతి చెప్పబోయిన నిన్న పొద్దున జరిగిన 'రస'వత్తరమైన సన్నివేశం మదిలో మెదిలి శ్రుతి బుగ్గలు సిగ్గుతో ఎరుపెక్కాయి.

''తీరిగ్గా కూర్చున్నారేంటి? మీకు ఆఫీసుకి టైమవడంలేదూ?'' అంది గోడగడియారం వంక చూస్తూ.

''బాప్‌రే... అరగంట లేటైంది కూడా... అత్తయ్యా! నేను ఆఫీసుకు బయలుదేరతాను మరి...'' అంటూ సోఫాలోనుండి లేచాడు శశాంక.

★ ★ ★

టైమ్ రాత్రి పది దాటింది.

మంగతాయారు శశాంక హాలు పక్కన వున్న గదిలో నిద్రకు వుపక్రమించింది.

కృతి తీరిగ్గా మంచం మీద మధ్యలో కూర్చుని దీర్ఘాలోచన చేస్తోంది.

''ఏమిటి రామయ్యా... దీర్ఘంగా ఆలోచిస్తున్నావ్?'' అన్నాడు శశాంక కసిగా.

''ఏం లేదు భీమయ్యా... నువ్వో కథ చెబుతావేమోనని!'' అంతే స్పీడుగా జవాబు చెప్పింది కృతి.

''సరే... కథ చెప్పగానే నిద్దరోతావా మరి?'' ఆశగా అన్నాడు.

''మంచి కథ చెబితేనే..''

''అలాగే.. మొదలెట్టనా? అనగనగనగనగా ఒక రాజు....''

కృతి ఆదిలోనే అడ్డుకుంది ''ఆగాగు. ఆ రాజుకి ఏడుగురు కొడుకులు. అంతేగా? ఈ కథ నాకెప్పుడో తెలుసు. నాయనమ్మ నేను ఎల్‌కెజిలో వున్నపుడే చెప్పింది. ఏనుగు కథ చెప్పు...''

అటువైపు తిరిగి పడుకుని వున్న శ్రుతి కిసుక్కున నవ్వింది. అలా ఆమె నవ్వినట్టు శశాంకకు స్పష్టంగా తెలిసిపోయింది.

''ఇదిగో నువ్విలా నా పరిస్థితికి జాలిపడి నవ్వక్కర్లేదు. ఈ తుగ్లక్‌ను పది నిమిషాల్లో నిద్రపుచ్చకపోతే నా పేరు శ్రీకృష్ణదేవరాయలే కాదు.'' అన్నాడు ఉడుక్కుని.

కృతికి అతడి మాట పూర్తిగా అర్థం కాకపోయినా ఏదో ఒక కామెంట్ చేసే అలవాటుకి ''ఏం కాదు. నీ పేరు శశాంక'' అంది.

''సరే... ఆ విషయాన్ని మీ నాయనమ్మ, తాతయ్య ముప్పయ్యేళ్ళ క్రితమే ధృవీకరించారు గానీ, మనం కథ కంటిన్యూ చేద్దామా? మరే, అప్పుడు ఏనుగు అడవిలోకి వెళ్లింది.....''

''ఊహూ... కాదు, మొదట్నించీ చెప్పు'' మళ్లీ అడ్డుపుల్ల.

''అనగనగనగనగా ఓ ఏనుగు. దానికి రెండు చెవులు, నాలుగు కాళ్లు, ఒక తొండం...''

''నానోయ్.. మనకు రెండు కాళ్లు, రెండు చేతులు వుంటాయి కదా? మరి, ఏనుగుకెందుకూ నాలుగు కాళ్లు?'' శాసనసభలో ప్రతిపక్ష నాయకుడి ప్రశ్న.

శశాంక వెంటనే జవాబు చెప్పలేక బుర్ర గోక్కున్నాడు.

కృతి ఫక్కున నవ్వింది. ''నీకు తెలీదు కదూ... ఎందుకంటే, దానికి చేతులుండడానికి ప్లేస్ లేదుగా?''

''దానికి ఇప్పుడు మనమేమీ చేయలేం గానీ, కథ చెప్పమంటావా?''

మహారాణి మళ్ళీ ఆలోచించింది. ''వద్దులే. నీకు నిద్దరొస్తోంది గానీ, నేను పాట పాడతాను. నువు నిద్దరో...'' నిర్ణయించేసింది.

''చివరికి జరిగేదదే గానీ... అలా కాదు, ఇంకో మాట చెప్పు''

''అమ్మ కథ చెబుతుంది. మనం బుద్ధిగా విందామా యేం?'' మధ్యేమార్గం.

''తొందరగా కథ ముగించవే బాబూ... నాకు ఓపిక నశిస్తోంది'' చేతులు జోడించి శ్రుతిని బతిమాలాడు.

''వుండూ... ఇంకా మొదలెట్టందే!''

శ్రుతి చిన్నగా నవ్వుతూ ఇటువైపు తిరిగింది. ''మరే, మా మంచి కృతమ్మలాగే ఓ బుల్లి ఏనుగు వుండేది. అది ఓ రోజు స్కూలుకెళుతుంటే దాని క్లాస్‌మేట్ సింహం కనిపించింది. రెండూ మాట్లాడుకుంటూ అలా అలా నడుస్తూంటే దూరంగా స్కూలు బెల్లు వినిపించింది....''

శ్రుతి చెబుతుంటే కృతితోపాటు శశాంకకీ చిన్నగా కునుకుపట్టింది. శ్రుతి కమ్మని స్వరమంటే అతడికి అపారమైన అభిమానం. తనకు తెలీకుండానే మౌనంగా ఆమె మాటలను వింటూ వుండిపోతాడు.

ఓ రెణ్ణిమిషాలయ్యాక చటుక్కున మెలకువ వచ్చింది శశాంకకు.

తల్లీకూతుళ్లిద్దరూ ఒకరిమీద మరొకరు చేతులు వేసుకుని నిద్రాదేవి ఒడిలో వున్నారు. శ్రుతి చేతిమీద మెల్లిగా గోకాడు. ''శ్రుతీ... ఓయ్ సురుచీ... పూతనా, నా చిన్నారి చేతనా...'' అంటూ చెవిలో గొణిగాడు.

అయినా శ్రుతి ప్రశాంతంగా నిద్రపోతోంది. అలా అతడు ఓ పదినిమిషాలు ప్రయత్నించాక నెమ్మదిగా కళ్లు తెరచి ''అబ్బ, నిద్రొస్తోందండీ...'' అని కృతిని మరింత దగ్గరగా పొదివిపట్టుకుని అతడి జవాబు కోసమైనా ఎదురు చూడకుండా నిద్రలోకి జారుకుంది. శశాంకకు ఒళ్లు మండిపోయింది.

విసురుగా లేచి దిండు, దుప్పటి తీసుకుని తలుపు తీసి బయటకు వచ్చాడు. హాలులోకి వచ్చి సోఫాలో దిండు పడేసి దుప్పటి ముసుగేసి పడుకున్నాడు.

మంచినీళ్లకని బయటకు వచ్చిన మంగతాయారు ఈ తతంగాన్నంతా సాక్షికంగా చూసి పూర్తిగా విషయాన్ని గ్రహించింది.

★ ★ ★

మౌస్ చేతిలోకి తీసుకుని సిస్టమ్ ఆపరేట్ చేయబోయాడు శశాంక. కర్సర్ కదలలేదు. తిక్కరేగిపోయింది. తీవ్రస్వరంతో బెల్ నొక్కాడు. బయటినుండి ఆఫీస్ అసిస్టెంట్ శ్రీను భయంభయంగా పరిగెత్తుకొచ్చాడు.

''ఏమయ్యా, ఈ మౌస్ పనిచేసి చావడం లేదని నీకెన్నిసార్లు చెప్పాను? మార్చాలన్న ఇంగితజ్ఞానం లేదూ?''

''నిన్ననే మార్చానండీ! బహుశా సిస్టమ్ స్ట్రక్ అయ్యిందేమో.. ఓసారి రీస్టార్ట్ చేయమంటారా?'' అంటూ మౌస్ చేతిలోకి తీసుకుని రీస్టార్ట్ చేశాడు శ్రీను.

''ఊ... సర్లే! వాణ్ణి టీ తీసుకురమ్మని చెప్పి అరగంటైంది....'' అని స్టార్ట్ మెనూలోకెళ్లి తనకు కావలసిన ఫైల్‌ని ఓపెన్ చేశాడు శశాంక.

సరిగ్గా అప్పుడే రాజు ట్రేలో టీ తీసుకొచ్చి టేబుల్ మీద పెట్టి సిగరెట్‌పెట్టె అందించాడు.

శశాంకకు తలనొప్పిగా వుంది. ఓ సారి కణతలు నొక్కుకుని టీ చేతిలోకి తీసుకున్నాడు. సిగరెట్ వెలిగించాడు.

టీ తాగుతుండగా ఫోన్ మోగింది.


''హలో.. శశాంక హియర్...''

''ఏమండీ, నేను... పిన్ని ఊరెళతానంటున్నారు. మరో నాలుగు రోజులుండమంటే వినడం లేదు. మీరైనా చెప్పండి కాస్త..'' అంటూ ఫోన్ మంగతాయారుకిచ్చింది శ్రుతి అవతల.

''అదేంటత్తయ్యా, వచ్చి వారమైనా కాలేదు. అప్పుడే వెళతావా? ఎందుకంత తొందర?''

''వచ్చి నాలుగు రోజులైంది కదురా! అక్కడ మీ మామయ్య ఇప్పటికే వంటకు నానా అవస్థలు పడుతుంటారు. ఆ పనిమనిషికి చెవులు సరిగ్గా వినిపించవు. వంకాయ వండమంటే సొరకాయ, బెండకాయ వండమంటే కాకరకాయ వండిపెడుతుంది. ఆయనగారు కోపానికొచ్చి కేకలేస్తే 'ఉప్పు తగ్గిందా, మరికాస్త వేయమంటారా?' అని అడుగుతుంది''

శశాంక పగలబడి నవ్వాడు.



★ ★ ★

శశాంక లోపలికి అడుగెట్టగానే సోఫాలో తయారుగా చెప్పులు వేసుకుని కూర్చున్న కృతి కనిపించింది.

''నానోయ్! నేను అమ్మమ్మతో ఊరెళుతున్నాను. నీకు తెలుసా?'' అంది కృతి గబగబా తండ్రి దగ్గరకు పరిగెత్తుకొచ్చి.

శశాంక ఆశ్చర్యపోయి ''నువ్వా?· అక్కడ ఒక్కదానివీ వుండగలవా?'' అన్నాడు సోఫాలో కూర్చుంటూ.

''ఎందుకురా, అక్కడ నా మనవడు ప్రణీత్ లేడూ? చక్కగా వాడితో ఆడుకుంటుంది. అయినా నాకంటే ముందు అదే ఎలా తయారై కూర్చుందో చూడు!'' టవల్‌తో మొహం తుడుచుకుంటూ హాల్లోకొస్తున్న మంగతాయారు అంది చిరునవ్వుతో.

శ్రుతి టీ పట్టుకొచ్చి శశాంకకూ, మంగతాయారుకీ ఇచ్చింది.

''నానా... టీ తాగటం అయ్యిందా? తొందరగా కానీ...'' టైము చూడ్డం రాకపోయినా గోడగడియారం వంక చూస్తూ అంది కృతి.

''అయిందిలేగానీ, మళ్ళీ ఎప్పుడొస్తావురా?''

''నేను ఫోన్ చేస్తాలేరా! కిరణ్‌తో పంపిస్తాను. లేకపోతే, మీరిద్దరూ వీలు చూసుకుని రెండ్రోజులు వచ్చి వుండి దీన్ని తీసుకుని వచ్చేద్దురుగానీ... రైలుకి టైమవు తోందిరా శశీ, బయల్దేరదామా?''

''అలాగే అత్తయ్యా! పద...''

★ ★ ★

శశాంక సిగరెట్ వెలిగించుకుంటుండగా ఫోన్ మోగింది.

''శశాంక హియర్!''

''యెస్ బాస్! హమ్ ఆప్కే హై కౌన్? స్పైడర్ మాన్-2, తిరుడా తిరుడి...'' అంటూ అవతలివైపు నుండి శ్రుతి అల్లరిగా నవ్వింది.

''ఆహా... ఏమిటో అంత ఉల్లాసం? ఏంటోయ్, ఎందుకూ ఫోన్ చేశావ్?'' రిలాక్సింగ్‌గా కుర్చీలో వెనక్కివాలుతూ చిరునవ్వుతో అన్నాడు శశాంక.

''ఇందాక పిన్ని ఫోన్ చేశారండీ! ప్రణీత్, కృతి ఇద్దరూ చక్కగా ఆడుకుంటున్నారుట! మీ ముద్దుల కూతురు కూడా మాట్లాడింది. ఈ ఎండాకాలం సెలవులన్నీ అక్కడే గడిపేస్తుందిట!''

''మళ్ళీ ఫోన్ చేస్తానందా?''

''ఆ... రాత్రి భోజనాలయ్యాక చేస్తానని తనే చెప్పింది!''

''సరే... నేనిప్పుడే బయల్దేరుతున్నా. అరగంటలో వచ్చేస్తా...''

''ఏమిటో అంత దూకుడు? ఇది నా భాష కాదు, మీ కూతురి భాషే...''

''దూకుడా? చెప్తా. వస్తున్నాగా?''

ఫోన్ పెట్టేస్తూ చిన్నగా నవ్వుకుంది శ్రుతి. అతడి మాటలోని అంతరార్థం బోధపడిన శ్రుతి బుగ్గలు గులాబీ రేకులే అయ్యాయి.

★ ★ ★

రాత్రి భోజనాలయ్యాయి. పదయ్యేసరికే మంచం మీదున్నాడు శశాంక. చేతిలో తమలపాకులు, వక్కలున్న పళ్ళెంతో పడగ్గదిలోకి అడుగెట్టింది శ్రుతి. తలుపులు మూస్తున్నప్పుడు శ్రుతి 'బ్యాక్ సంపదం'తా శశాంకను వెర్రెక్కించింది.

లేతాకుపచ్చ రంగు నైటీ శ్రుతి అందాలను దాచడానికి చూస్తున్నదో, బయటపెట్టేందుకు చూస్తోందో శశాంకకు అర్థం కాలేదు.

శ్రుతి మంచంమీద కూర్చోగానే ఆమె ఎదపొంగులను చటుక్కున తగిలాడు శశాంక.

షాక్ కొట్టినట్టు వెనక్కి జరిగి ''ష్... అబ్బ! ఏమిటంత తొందర?'' అంది చిరుకోపంగా.

శశాంక అమాయకమైన మొహంతో ''హయ్యయ్యో! నాకెలాంటి దురుద్దేశమూ లేదు శ్రుతీ... నైటీ మీద పూలు నిజమైనవేమో తీసి వాసన చూద్దామనుకున్నా. ఓహో... అది డిజైనా?'' అన్నాడు.

''అవునా? నా చెవుల్లో గోబీపూలు, జిల్లేడు పూలేమైనా కనిపిస్తున్నాయా?''

''రాక్షసికి ఫోన్ చేద్దామా?'' ఫోన్ అందుకోబోయాడు.

''హమ్మో... తనే చేస్తాననీ, మనం చేయొద్దనీ ఆర్డరేసింది యజమానురాలు..'' భయం నటిస్తూ అంది శ్రుతి. సరిగ్గా అప్పుడే ఫోన్ మోగింది. శశాంక ఆత్రంగా రిసీవర్ అందుకున్నాడు.

''హలో...''

''నానోయ్... నేనేం చేస్తున్నానో తెలుసా? అన్నం భోంచేస్తున్నా...'' హుషారుగా చెప్పింది కృతి.

''అదేంట్రా అంకులూ! నువెప్పుడూ గాలి భోంచేస్తావుగా?''

''అదంతేలేరా పెంకులూ! ఇంతకీ నాయనమ్మ ఏం వండిందో తెలుసా? బెండకాయ వేపుడు, టమాట పప్పు... ఊ... ఇంకా...''

''సర్లే, అవన్నీ తింటున్నావా, నాయనమ్మను విసిగిస్తున్నావా?''

''నేనేం విసిగించట్లే.. నువ్వే విసిగిస్తావ్...''

మంగతాయారు రిసీవర్ అందుకుంది. ''ఒరే శశీ! వీళ్ళిద్దరూ ఎంత బాగా కలిసిపోయారనుకున్నావ్? చక్కగా ఆడుకుంటున్నారు. మీరేం బెంగ పెట్టుకోకండి. ఈ సెలవుల్లో మొత్తం ఇక్కడే వుంటుంది. వుండనా మరి? మళ్ళీ రేపు ఫోన్ చేస్తాలే!''

''అలాగే అత్తయ్యా! గుడ్‌నైట్!''

ఫోన్ డిస్కనెక్ట్ అయింది.

అప్పటిదాకా తమలపాకులు చుడుతూ కూర్చున్న శ్రుతి శశాంక నోటిదాకా తీసుకొచ్చి తీరా అతడు అందుకోబోయేంతలో వెనక్కి తీసుకెళ్ళి అల్లరిగా నవ్వింది. అలా రెండు మూడుసార్లు జరిగాక శశాంక అదనుచూసి తమలపాకు అందుకునేందుకు ఆమె మీదికి లంఘించాడు. ఇద్దరూ మంచంలో వెనక్కి పడడంతో శ్రుతి కెవ్వుమంది.

''ష్... ఏంటదీ? ఎవరైనా వింటే ఇక్కడ రేపులైపోతున్నాయనుకుంటారు!''

''అంటే? అటువంటి ఉద్దేశమేదీ లేదా? హయ్యో...'' కవ్వించింది.

''చెప్పినట్టు వినకపోతే జరిగేదదే అనుకో... అయినా నువ్వూరుకుంటావా రాక్షసివి...''

అతడి మాట పూర్తి కాకుండానే శ్రుతి శశాంకను కిందికి తోసి పైకొచ్చి పెదవుల మీద ఘాటైన కిస్సిచ్చింది.

ఆ పెనుగులాటలో దిండు కాస్త పక్కకు జరిగింది.

దానికింద మడతపెట్టిన కాగితం శ్రుతి కంటబడింది.

''ఏంటోయ్ ఇదీ? లవ్‌లెటరేమైనా రాసిపెట్టావా?'' అంటూ విప్పి చూశాడు. మంగతాయారు చేతిరాత కనిపించేసరికి ఆత్రంగా చదవడం మొదలెట్టాడు.

''డియర్ శశీ, శ్రుతీ!

మొన్న నేను వచ్చినరోజు రాత్రి జరిగిన సంఘటన చూశాను. మంచినీళ్ల కోసం హాలులోకొచ్చినపుడు నువ్వు విసురుగా వచ్చి సోఫాలో పడుకోవడం కనిపించింది. జరిగిందేమిటో గ్రహించాను. అమ్మాయ్, మీ పెళ్లయిన కొత్తలో ఏం జరిగిందో గుర్తుందా? వాడు కొత్త ఉద్యోగం వేటలో పడి దాదాపు మూణ్ణెల్లు తిండీ తిప్పలూ మరచి ఊళ్లమ్మట తిరిగాడు. కొన్ని సందర్భాలలో ఉద్యోగం లేక, నీకు మొహం చూపించడం ఇష్టం లేక మా ఇంట్లో రాత్రుళ్ళు పడుకునేవాడు. ఆ తర్వాత దొరికిన ఉద్యోగం బెంగుళూరు బ్రాంచికి పంపిస్తే ఐదారునెలలు అక్కడే కాలక్షేపం చేశాడు ఒంటరిగా. పెళ్ళైన ఈ ఏడేళ్ళలో మీరెంత సుఖపడ్డారో నాకు తెలుసు. ఇప్పుడు ఈ రాక్షసి రాత్రుళ్ళు కథలతో, యక్షప్రశ్నలతో మిమ్మల్ని వేధిస్తోంది కదూ? పనిగట్టుకుని కన్నకూతుర్ని పరాయిళ్లల్లో వుంచి మీరు సుఖపడాలని చూడలేరు. ఆ సంగతి నాకు తెలుసు. అందుకే కృతిని తీసుకెళుతున్నా. యవ్వనం తిరిగి రానిది. ఎప్పటికప్పుడు బరువు బాధ్యతలు పెరుగుతూనే వుంటాయి తప్ప తరగవు. ఈ నెలరోజులూ మీరు నవదంపతుల్లా గడపండి. హావ్ ఎ నైస్ టైమ్.

మీ మంగతాయారు''

ఉత్తరం చదవడం పూర్తిచేసిన శశాంక కళ్ళు చెమర్చాయి.

''చూశావా... మా అత్తయ్యకు మనమంటే ఎంత ప్రేమో...''

''బాసూ... ఇప్పుడలా కళ్ళు చెమర్చుకుంటూ రాత్రంతా...''

''లేదులే! 'టైమేన సమయం సుఖసంసారం సమరం నమస్కారం' అని సుభాషితం...''

''మనకిప్పుడు కావలసింది సుభాషితాలు కాదంకులూ...''

''నిజమేరా పెంకులూ...'' అంటూ శ్రుతిని పూర్తిగా ఆక్రమించాడు శశాంక.

☆